ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 27 డిసెంబరు 2024



నేడు పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం

- కార్యక్రమానికి హాజరుకానున్న కలెక్టర్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించనున్నారు. ఆసుపత్రిలో రూ.25లక్షల వ్యయంతో నూతనంగా రెండవ అంతస్తులో ఏర్పాటు చేసిన కంటి ఆపరేషన్ థియేటర్, పేషెంట్ అటెండర్ వెయిటింగ్ రూమ్, ఏఆర్‌టీ సెంటర్, పెయింగ్ రూమ్‌లను ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరుకానున్నారు.

ప్రధాన రహదారి ఇలా.. ప్రయాణించేది ఎలా?



గుడిపల్లి ప్రధాన రహదారిపై పూడ్చని పైపులైన్ గుంత

పాలకుర్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని గుడిపల్లి నుంచి ధర్మారం, గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారిపై గ్రామానికి తాగు నీరందించే పైపులైన్ పగిలింది. దీంతో రెండు నెలల క్రితం తవ్వి మరమ్మతు పనులు పూర్తిచేశారు. కానీ గుంతను పూడ్చకపోవడంతో అక్కడ నీరు నిలవడంతో పాటు ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలను కొనసాగిస్తాయి. గోదావరిఖని నుంచి ధర్మారం రోజూ నాలుగుసార్లు ఆర్టీసీ బస్సు ఇదే దారిగుండా వచ్చిపోతుంది. సమీపంలోనే ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల, బస్టాప్ ఉన్నది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో గుంతను పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరిగితే ఎలా అని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సి బ్బంది తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్..

కోల్‌సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పలు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పైకప్పులు లేవు. దీంతో ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డు మధ్యలో గుంతల్లో పడి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. కళ్యాణ్‌నగర్ ఉల్లిగడ్డల బజార్ సమీపంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ చాంబర్లకు కవర్లు లేకపోవడంతో వ్యాపారులు సంచులకు కట్టెలు కట్టి ప్రమాదాలు జరుగకుండా సూచనలు పెట్టారు.



పైకప్పు లేక ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్



కాల ప్రవాహంలో మరో సంవత్సరం కలిసిపోతోంది. కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో స్వాగతం చెప్పేందుకు ప్రజలు సిద్ధమతున్నారు. ఈ యేడు రాజకీయంగా, సాంస్కృతికంగా, అభివృద్ధిపరంగా పలు సంఘటనలు జరిగాయి. వీటిని ఒకసారి 'యాది' చేసుకుందాం.. ఈ సంవత్సరం పలు రంగాల్లో జరిగిన సంఘటనలు, ఆసక్తికర పరిణామాలను 'ఆంధ్రజ్యోతి' మీకు అందిస్తోంది...

కాంగ్రెస్‌దే పైచేయి



- అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్
- ప్రభుత్వ విధానాలపై పోరాడుతున్న బీఆర్ఎస్, బీజేపీ
- 'స్థానిక' ఎన్నికల్లో పట్టు కోసం తహతహ..



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది.. ఈ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ గెలుపొంది బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీలపై పైచేయి సాధించింది. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లి బీఆర్ఎస్ పార్టీ పుంజుకునేందుకు యత్నిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ శాతం ఓట్లు పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన భారతీయ జనతా పార్టీ దానిని నిలుపుకునే పరిస్థితి కనబడడం లేదు. ఒక ప్రణాళికాబద్ధంగా బీజేపీ నాయకులు అడుగులు ముందుకు వేయడం లేదు. మరో నెల, రెండు నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీలు తహతహలాడుతున్నాయి. ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకునేందుకు ఇప్పటినుంచే వ్యూహాలు పన్నుతున్నారు. ఆపరేషన్ ఆకర్ష్‌తో విపక్ష పార్టీల్లో ఉన్న నాయకులను లాక్కుని ఆ పార్టీలను కకావికలం చేయాలని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నప్పటికీ, వారి రాకను కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు అడ్డుకట్ట వేస్తున్నారు.

● పెద్ద దిక్కుగా మంత్రి శ్రీధర్‌బాబు..

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి నుంచి చింతకుంట విజయరమణారావు, రామగుండం నుంచి రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ గెలుపొందారు. శ్రీధర్‌బాబుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి పదవి వరించింది. ఆయన జిల్లాకు పెద్దదిక్కు కాగా, ప్రభుత్వంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అన్ని తానై చక్కదిద్దుతున్నారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నిధులు తీసుకరావడంలో ఆయన ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్ సింగ్‌లను కలుపుకుని వెళుతూ అభివృద్ధికి కోట్ల నిధులు తీసుకవస్తున్నారు.



పార్లమెంట్ ఫలితాల తరువాత విజయసంకేతం చూపుతున్న కాంగ్రెస్ నాయకులు(ఫైల్)

● పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ విజయం..

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎంపీ వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ 1,31,771 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆయనకు 4,80,994 రాగా, రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్‌కు 3,49,339 ఓట్లు సాధించారు. మూడో స్థానంలో నిలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ 1,94,821 ఓట్లు సాధించారు. పార్లమెంట్ పరిధిలో అంతగా క్యాడర్, బలం లేని బీజేపీ రెండో స్థానంలో నిలవడం గమనార్హం. ఒక దశలో బీజేపీ అభ్యర్థి గెలుపొందనున్నారనే టాక్ వచ్చింది. ఈ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉండడం వంశీకృష్ణ విజయానికి దోహదపడింది.

● ఇద్దరికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులు..

జిల్లాకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు

మిగతా 8వ పేజీలో...



గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

నాలుగేళ్లుగా నిలిచిన 'అమ్మ ఒడి'

- లబ్ధిదారులకు అందని డబ్బులు
- ఆసుపత్రి చుట్టూ ప్రదక్షిణలు

7



గోదావరిఖని ఆర్టీసీ డిపో

ఖని ఆర్టీసీ డిపోలో పాముల సంచారం

- ఇటీవల ఒకరికి పాముకాటు
- భయాందోళనలో ఉద్యోగులు

8

పోలీస్ కమిషనరేట్‌లో కొత్త 'నిబంధన'

- ప్రెస్‌తో సంబంధాలపై కట్టడి.. విభాగాలకు సర్క్యూలర్

కోల్‌సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ప్రెస్‌కు దూరంగా ఉండాలంటూ 'నిబంధన' పెట్టారు. ఈ మేరకు కమిషనరేట్‌లోని వివిధ విభాగాలకు ఇటీవలే సర్క్యూలర్ జారీ చేశారు. యూనిట్ అధికారి అనుమతి లేకుండా ఎవరూ కూడా ప్రెస్‌కు సమాచారం ఇవ్వవద్దని, వారితో విషయాలు పంచుకోవద్దంటూ ఆదేశాలు ఇచ్చారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, సీసీఆర్‌బీ, ఎస్‌ఐబీ, సీసీఎస్, సైబర్ క్రైమ్ తదితర విభాగాలుంటాయి. అడ్మినిస్ట్రేషన్ అధికారి పర్యవేక్షణలో కార్యాలయ నిర్వహణ ఉంటుంది. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని ఆర్మ్‌డ్, సివిల్ విభాగాల పర్యవేక్షణ అంతా కమిషరేట్ నుంచే సాగుతుంది. ఇందుకుగాను అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సహాయకారిగా ఉంటారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయి. ముఖ్యంగా మంచిర్యాల జిల్లాకు సంబంధించి ఆర్థిక నేరాలు, పేకాట స్థావరాల నిర్వహణ, అక్రమ దందాల విషయంలో పోలీస్ శాఖపై సైతం అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు ఇంటలీజెన్స్ విచారణ కూడా జరిగింది. ఈ పరిస్థితుల్లో సమాచారం లీక్ కాకుండా కమిషనరేట్ విభాగాలను కట్టడి చేసినట్టు తెలుస్తోంది. కాగా, ప్రత్యేకంగా నిబంధన పెట్టడం ఇప్పుడు కమిషనరేట్‌లో చర్చనీయాంశం అయ్యింది.

నేడు జిల్లాకు రెండు 108 అంబులెన్స్‌లు..

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పెద్దపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు రెండు కొత్త 108 అంబులెన్స్‌లు రానున్నాయి. రామగుండం, కమాన్‌పూర్ మండ లాలకు చెందిన 108 అంబులెన్స్‌లు నెల 15 రోజుల క్రితం కాలం చెల్లి మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాటి స్థానంలో కొత్త వాహనాలను తీసుకవచ్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం అవి జిల్లాకు చేరనున్నాయి. ఈనెల 20న '108 అంబులెన్స్‌లకు సుస్తీ' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి సంబంధించిన జిల్లా అధికార యంత్రాంగం పాతవాటి స్థానంలో రెండు కొత్త అంబులెన్స్‌లు తీసుక రానున్నారు. స్క్రాప్‌నకు వెళ్లిన కమాన్‌పూర్ రామగుండం మండలాల చెందిన అంబులెన్స్‌ల స్థానంలో కొత్తవి రానున్నాయి. మిగతా మండలాల అంబులెన్స్‌ల పరిస్థితి అంతంతా మాత్రంగా ఉన్నాయి. పెద్దపల్లి అంబులెన్స్ నెల రోజుల క్రితం మరమ్మతులకు వెళ్లి 10 రోజుల క్రితం పెద్దపల్లికి వచ్చింది. ఈ అంబు లెన్స్‌తో పాటు ఓదెల మండలం అంబులెన్స్ కూడా కాలం చెల్లినదే. ఇప్పుడు గతంలో మార్చిన 4 అంబులెన్స్‌లతో పాటు నూతనంగా వచ్చిన అంతర్గాం, శుక్రవారం రానున్న కమాన్‌పూర్, రామగుండం వాటితో కలిపి మొత్తం 7వాహనాలు అత్యవసర సేవలందించనున్నాయి. ఓదెల, పెద్దపల్లి అం బులెన్స్‌లు మార్చేస్తే అన్ని వాహనాలు కండీషన్‌లో ఉంటాయి. అయితే ఈనెల 2న జూలపల్లి, అంతర్గాం, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం మండలాలకు 108 వాహ నాలను కేటాయించారు. అయితే ఇందులో అంతర్గాం మినహా అన్ని వాహనాలను జీవీకే ఈఎమ్మార్‌ఆర్‌ఐ సంస్థ వాపస్ తీసుకెళ్లింది. జనవరి మొదటి వారంలో ఈ మూడు వాహనాలు కూడా జిల్లాకు తిరిగిరానున్నాయి.

ఘనంగా ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కమాన్‌పూర్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకుల జామున పాత ఆలయంలో నుంచి పోచమ్మ విగ్రహాన్ని పంబాల పూజారులు జమిడిక డప్పుచప్పుళ్ల మధ్య తీసి నూతనం గా నిర్మించిన ఆలయంలో పునఃప్రతిష్ఠాపన చేశారు. అనంతరం బోనాల ఉత్సవం నిర్వ హించి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించారు. ఆలయం ఆవరణలో భక్తులకు అన్నప్రసాదం చేశారు. ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

సుల్తానాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడి వైద్య ఖర్చుల కోసం సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 30 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజే శారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కొయ్యడ భాను అనే యువకుడు డిగ్రీ పరీ క్షలు రాసేందుకు కరీంనగర్ వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అసుపత్రి ఖర్చుల కోసం వాకర్స్ 30వేల రూపాయలు గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు.

మృతుడి కుటుంబానికి..

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వడ్లూరి నాగరాజు ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు సొన్నాయిటెంకం శివరామకృష్ణ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడికుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దర్మల రాములు, బొబ్బిలి శ్రీనివాస్, బందెల శ్రీనివాస్, మెట్టు లక్ష్మయ్య, మెట్టు లక్ష్మణ్, మెట్టు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టే ఆర్డర్ ఇచ్చినా దౌర్జన్యం..

గోదావరిఖని, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ అశోక్ థియేటర్ స్థలంపై హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినా దౌర్జన్యం చేయడం సరికాదని తెలుగు షార్ట్‌ఫిలిం ఆర్టిస్ట్ అసోసి యేషన్ అధ్యక్షుడు బాడుకోలు దేవేందర్‌రెడ్డి, గన్నవరం సుదర్శన్, ముడుపు శ్రీనివాస్, నిమ్మల శ్రీనివాస్, జువ్వాజి సునీతలు అన్నారు. గురువారం లక్ష్మీనగర్‌లోని ఓల్డ్ అశోక థియేటర్ కూల్చివేతలను సందర్శించి మాట్లాడారు. సింగరేణి, రెవెన్యూ, కార్పొరేషన్ సంబంధించిన వారు కాకుండా కొందరు అక్రమార్కులు చొరబడడం సరికాదన్నారు. వేముల అశోక్, తాడూరి మధుకర్, రామోజీ మధు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అవార్డుకు ఎంపిక

కోల్‌సిటీటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ నేషనల్ సోషల్ సర్వీస్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు గోదావరిఖని జనగామ గ్రామానికి చెందిన ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం ఎంపికయ్యారు. ఈ మేరకు అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ మనీష్‌గవాయి, ప్రియాంక సాతే ఒక ప్రకటనలో తెలి పారు. జనవరి 3న న్యూఢిల్లీలో ఇబ్రహీం అవార్డును అందుకోనున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నందుకు, పర్సనాలిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్‌గా శిక్షణ ఇస్తున్నందుకు గాను అవార్డుకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు.

సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం
- గోదావరిఖనిలో భారీ ర్యాలీ

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పరిరక్షణకు, మత రాజకీయాలకు వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల వ్యవధిలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు చేసి విజయాలను సాధించిందన్నారు. సీపీఐని 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్‌లో స్థాపించారని, నాటి స్వతంత్ర ఉద్యమం నుంచి నేటి తెలంగాణ ఉద్యమం వరకు వీరోచితంగా పోరాడింది కమ్యూనిస్టులేనన్నారు. కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా, పదవులు ఉన్నా లేకున్నా ప్రతినిత్యం ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని, దీనికి పార్లమెంటులో హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా హోం మంత్రి జాతికి క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆరు గ్యారెంటీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కోడం స్వామి, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మానస్ కుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి చంద్రగిరి ఉదయ్, అంజి, సహాయ కార్యదర్శి కళ్లేపల్లి శంకర్, ఓదెలు, నవీన్, లక్ష్మణ్, శంకర్, బండారి సదానందం, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటంలో సీపీఐ ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ పార్టీ నగర కార్యదర్శి కే కనకరాజు అన్నారు. సీపీఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్, చౌరస్తాలో జరిగిన జెండా విష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు కార్మికుల, కర్షకుల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. పట్టణంలో ఎల్‌బీనగర్, లెనిన్‌నగర్, ఫైవింక్లయిన్, బస్టాండ్, పవర్‌హౌస్‌కాలనీ, జనగామ, కూరగాయల మార్కెట్‌లో సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోషిక మోహన్, మడ్డి ఎల్లయ్య, కే స్వామి, తాళ్లపల్లి మల్లయ్య, ఆరెపల్లి పోషం, మార్కపురి సూర్య, ఓదమ్మ, రమేష్‌కుమార్, చంద్రశేఖర్, ప్రీతం, విజయ, నర్మద, అబ్దుల్ కరీం, జగన్ పాల్గొన్నారు. కాగా, సీపీఐ శత ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. భాస్కర్‌రావు భవన్ నుంచి ఎర్ర జెండాలతో సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లతో ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ గోదావరిఖని చౌరస్తా వరకు కొనసాగింది.



జిల్లా కేంద్రంలో సీపీఐ జెండాను ఎగురవేస్తున్న తాండ్ర సదానందం



గోదావరిఖనిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు



ఖని చౌరస్తాలో సంబరాలు నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వాజ్‌పేయి కృషి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి ఎనలేని కృషి చేశారని బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ కే రాజగోపాల్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య అన్నారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివని, గ్రామీణ సడక్ యోజన పథకం క్రింద ప్రతి గ్రామంలో రోడ్లు వేయించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సర్వశిక్ష అభియాన్ ద్వారా పేద పిల్లల చదువు కోసం కృషి చేశారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శిలారపు పర్వతాలు, పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, కాసిపేట శివాజీ, జక్కుల నరహరి, నవీన్, శ్రీనివాస్, మంజు, కుమారస్వామి పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

● జ్యోతినగర్ (ఆంధ్రజ్యోతి) : భారత రత్న, మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం ఎన్టీపీసీలో బీజేపీ శ్రేణులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. అన్నపూర్ణకాలనీలో దుర్గయ్యపల్లి ప్రభుత్వ పాఠశాలలో బీజేపీ రామగుండం నియోజకవర్గం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెరుగు హన్మంతుగౌడ్ ఇతర నాయకులు పాల్గొని శ్రమదానం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. అజాత శత్రువుగా, నిజాయితీగల రాజకీయ నాయకుడిగా నిలిచిన వాజ్‌పేయి అందరికి ఆదర్శమని నాయకులు అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిట్టపల్లి సతీష్, గాండ్ల ధర్మపురి, కోమళ్ల మహేశ్, కుమారస్వామి, సంజీవ్, రమేష్, భూమయ్య, అంజి, తిరుపతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన విద్యుత్ కంచె

- విద్యుదాఘాతంతో మృహిళ మృతి



రేణుక(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోతుల బెడద నుంచి రక్షించుకునేందుకు ఇంటి చుట్టూ అమర్చిన విద్యుత్ తీగె ఆమె పాలిట మృత్యువైంది. విద్యుదాఘాతంతో గురువారం సిద్దాల రేణుక (36) మృతి చెందింది. ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలో కోతుల బెడద అధికమవడంతో తాజా, మాజీ ఉప సర్పంచ్ బాలయ్య తన ఇంటి చుట్టూ విద్యుత్ తీగలను అమర్చాడు. ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయలను సాగు చేశాడు. అతని భార్య రేణుక సాగు చేసిన కూరగాయాల వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు తీగ తగిలి విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన బాలయ్య చుట్టు పక్కల వారి సహాయంతో ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. మృతురాలికి భర్త బాలయ్య, కూతురు ప్రవళిక ఉన్నారు. సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి తదితరులు పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

గొల్లపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీబీరాజ్‌పల్లె గ్రామంలో దొనకొండ గంగాధర్ (23) అనే యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని గురువారం బలవన్మరణం చెందినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. గంగాధర్ కొంత కాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణం చెందాడు. మృతుడి తల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవై. నగర్‌కు చెందిన మార్గం మల్లవ్వ (75) అనే వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఈ నెల 17న ఇంట్లో వంట చేస్తుండగా చీరెకు మంటలు అంటుకొని గాయాలయ్యాయి. కాలిన గాయాలతో ఉన్న వృద్ధురాలిని స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

యువకుడికి కత్తి పోట్లు

- డబ్బు పంపకంలో స్నేహితుల మధ్య గొడవ

జ్యోతినగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఎన్టీపీసీ ఆటోనగర్‌లో గురువారం ఎండి.గాలీబ్ అనే యువకుడు కత్తిపోట్లకు గురయ్యాడు. అదే కాలనీకి చెందిన ఫిరోజ్ అనే మరో యువకుడు గాలీబ్ కడుపులో కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాలీబ్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో అతన్ని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. ఎన్టీపీసీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్‌కు చెందిన గాలీబ్, ఫిరోజ్ స్నేహితులు. గతంలో ఇద్దరు యువకులు కొత్తగూడెంలో కలిసి పనిచేశారు. ఆ పనికి సంబంధించిన డబ్బుల పంపకం విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తనకు ఇంకా కొంత డబ్బు రావాలని ఫిరోజ్‌ను నిలదీయడంతో రెండు రోజులుగా ఇద్దరి మధ్య గొడవ మరింత పెరిగింది. ఈ క్రమంలో ఫిరోజ్ కోపంతో గాలీబ్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి దేవవ్వ (40) అనే మహిళ అదృశ్యమైనట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 24న బయట పని ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని ఆమె మరిది సాగర్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. అదృశ్యమైన మహిళ చామన చాయ రంగు కలిగి ఉండి నీలి రంగు పంజాబి డ్రెస్ ధరించి ఉందని తెలిపారు. ఆచూకీ తెలిస్తే 8712656366 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వేర్వేరు చోట్ల ప్రమాదం.. ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని బుధవారం రాత్రి జరగిని రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్ విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వెంకటాపూర్‌కు వస్తున్న క్రమంలో డీసీఎం వ్యాను వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ..

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): దుమాల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేములవాడ మండలం లింగంపల్లికి చెందిన వ్యక్తి లింగంపల్లి రాజుకు తీవ్ర గాయలయ్యాయని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. లింగంపల్లి గ్రామానికి చెందిన రాజు తన బైక్‌పై ఈ నెల 25న ఎల్లారెడ్డిపేటలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో కోళ్ల వ్యాను ఢీకొట్టిందని చెప్పారు. తీవ్ర గాయలపాలైన రాజును రీంనగర్‌కు తీసుకెళ్లారని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తు న్నామని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో..

మానకొండూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో గురువారం కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అజయ్ తన కారులో మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో జరిగిన వివాహానికి హాజరయ్యాడు. కారులో పెట్రోల్ నింపుకునేందుకు వెళ్తుండగా రోడ్డు నిర్మాణానికి మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నడకతో ఆరోగ్యం

- రద్దీగా మారుతున్న మైదానాలు
- వాకర్స్ క్లబ్‌ల ఏర్పాటు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవన విధానం యాంత్రికంగా మారడంతో తగిన వ్యాయామం లేక చాలా మంది బీపీ, షుగర్, స్థూలకాయం లాంటి రుగ్మతల బారిన పడుతున్నారు. అలుపెరుగని పనులు, గాడి తప్పుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్యం వంటివి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. వీటికి విరుగుడుగా సంపూర్ణ ఆరోగ్యానికి దివ్య ఔషధంగా నడక ఉపకరిస్తుంది. నడక మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్, మానసిక ఒత్తిడి, రక్తపోటు, స్థూలకాయం, కొవ్వును తగ్గించి జీవత కాలాన్ని పెంచుతుంది. దీంతో పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా నడకను జీవితంలో ఒక భాగంగా చేసుకుంటున్నారు. 35 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు నడకపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. దీంతో మైదానాలు, రోడ్లు ఉదయంపూట వాకర్లతో రద్దీగా మారుతున్నాయి. వీరికితోడు వివిధ మైదానాల్లో వాకర్స్ క్లబ్‌ల ఏర్పాటుకు నోచుకున్నాయి. నడకతోపాటు ఆరోగ్యంపై అవగాహనను పెంచి ఆరోగ్యవంతమైన జీవనం అందించేందుకు వాకర్స్ క్లబ్‌లు కృషి చేస్తున్నాయి. చలికాలంలో లావెక్కేందుకు ఎక్కువ అవకాశాలు ఉండడంతో దీనిని నివారించేందుకు నడక ప్రారంభిస్తే మంచిది.





వాకింగ్ చేస్తున్న నగరవాసులు

● వాకింగ్‌తో లాభాలు

దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తుంది. ఒత్తిడిని తగ్గించి నిద్రకు ఉపకరిస్తుంది. అధిక బరువును, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మధుమేహం, గుండె జబ్బులు అదుపులోకి వస్తాయి. కీళ్లు బలపడతాయి. రక్త ప్రసరణ వేగవంతం అవుతుంది. సంపూర్ణ ఆరోగ్యానికి ఉదయాన్నే మంచి నీటిని ఎక్కువగా తాగాలి. ఆహారంలో ఉప్పు, ఆయిల్ మోతాదు తగ్గించాలి. ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఇంట్లోని వారంతా ఆనందంగా ఉంటారు. మహిళలు వాకింగ్ చేయడం వలన మోకాళ్ల నొప్పులను దూరం చేయవచ్చు. వీలైనంతవరకు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి మంచిది. వాకింగ్‌కు షూ తప్పనిసరిగా వేసుకోవాలి. రహదారులపై వాకింగ్ కంటే వీలైతే మైదానాలలోనే చేయడం మంచిది. నడిచేటప్పుడు శ్వాస నియంత్రణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

నూతన ఉత్సాహం కలుగుతుంది



-మధుసూదనాచారి, వాకర్స్ క్లబ్ కార్యదర్శి

వాకింగ్‌తో ఎప్పుడూ నూతన ఉత్సాహంగా కలుగుతుంది. నడవని రోజు అసౌకర్యంగా ఉంటుంది. ఉదయమే ఏకాగ్రతతతో నడవడం వలన నెగిటివ్ ఆలోచనలు దరిచేరవు. 20 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తున్నాను. వాకింగ్‌తోపాటు షటిల్, వాలీబాల్ లాంటి క్రీడలు ఆడుతుంటా.

నడక దివ్య ఔషధం



-ఆది శ్రీనివాస్, వ్యాపారవేత్త

నడక ఒక దివ్య ఔషధంగా ఉపయోగపడుతుంది. నడకను నా జీవితంలో ఒక భాగంగా చేసుకున్నా. 15 సంవత్సరాలుగా ప్రతి రోజు వాకింగ్ చేస్తున్నా. గతంలో కీళ్ల నొప్పులు ఉండేవి. ప్రస్తుతం అవేమీ లేవు. షుగర్, బీపీ నార్మల్‌గా ఉన్నాయి.

వ్యాధులు దరిచేరవు



- విద్యాసాగర్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి

ఆరోగ్యంగా జీవించడానికి, ఆనందంగా ఉండడానికి నడక ఎంతో ఉపయోగపడుతుంది. చాలాకాలంగా ప్రతిరోజు కనీసం 45 నిమిషాలైనా వాకింగ్ చేస్తున్నా. దీంతో బీపీ, షుగర్ లాంటి సమస్యలు తగ్గిపోతున్నాయి. ప్రతి ఒక్కరూ నడవడం వల్ల కీళ్లు బలపడతాయి.

అధిక బరువును తగ్గిస్తుంది



- బాబా సలీంబేగ్, వ్యాపారవేత్త

నడక సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. అధిక బరువును, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. 20 సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నా. ఒళ్లు నొప్పులు, బద్ధకం పూర్తిగా పోయింది. బీపీ, షుగర్ నార్మల్‌గా ఉంటున్నాయి. వాకింగ్ చేయనప్పుడు బద్ధకంగా ఉంటుంది. ఐ.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్‌లో గురువారం చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు నీలగిరి ప్రవీణ్ అనే వ్యక్తి ఇంటిలోకి చొరబడి బీరువా తలుపులు పగులగొట్టి మూడు తులాల బంగారు ఆభరణాలు అపహరించుకవెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

చందుర్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఆలయంలో ఉన్న హుండీని దొంగలు ఇనుప రాడ్డు, సెత్తెతో పగుల గొట్టేందుకు యత్నించారు. హుండీ పగలక పోవడంతో ఇనుప రాడ్డు, సుత్తె అక్కడే వదిలివెళ్లారు. ఈ సంఘటనపై అర్చకులు కొదంగుల్లా శ్రీకాంతాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం లక్ష్మారెడ్డిల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆలయానికి చేరుకుని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అంజయ్య తెలిపారు.

పోలీసులపై దాడి

- ఒకరిపై కేసు నమోదు

చొప్పదండి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలో పోలీసులపై దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కేసు నమోదయింది. చొప్పదండిలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. బందోబస్తు కోసం ఇద్దరు పోలీసులు అక్కడికి వచ్చారు. గుమ్లాపూర్‌కు చెందిన మండల శ్రీనివాస్ మద్యం మత్తులో పోలీసులపై దాడి చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై అనూష అక్కడికి రాగా ఆమెపై కూడా దాడి చేశాడు. పోలీసు వాహనంపై బండరాళ్లతో దాడిచేసి అద్దం పగులగొట్టాడు. కానిస్టేబుల్ నరసింహకు గాయాలయ్యాయి. శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

యువతికి గాయాలు

రాయికల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణ శివారులో ఆర్టీసీ బస్సులో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి యువతికి గురువారం గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాల నుంచి రాయికల్ మీదుగా నిర్మల్, ఖానాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 02 యూఏ 2995)లో గేటు వద్ద నిలబడిన అంజలి అనే యువతి ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రాజన్న ఆలయ హుండీలకు భద్రత కరువు

- నిండిన హుండీలు
- నగదు చోరీ చేసిన బాలురు
- భద్రత ఏర్పాటు చేయాలని వినతి

వేములవాడ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని హుండీలకు భద్రత కరువైంది. ఇటీవలి కాలంలో హుండీలు నిండిపోయాయి. దీంతో ముగ్గురు బాలురు నాలుగు రోజులుగా హుండీలోని నగదును చోరీ చేసినట్లు ఆలయ ఉద్యోగులు గుర్తించారు. రాజన్న ఆలయ గర్భగుడిలో నాలుగు పెద్ద హుండీలు, ఎనిమిది చిన్న హుండీలు ఏర్పాటు చేశారు. ఇటీవల భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో హుండీలు నిండిపోయాయి. గర్భగుడిలోకి వెళ్లే ప్రధాన ద్వారం సమీపంలో కుడివైపు ఏర్పాటు చేసిన హుండీలోని డబ్బులను ముగ్గురు బాలురు చేతి ద్వారా తీయడం బుధవారం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. సిబ్బంది గుర్తించి బాలురను పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించగా బాలుర వద్ద రూ. 28 వందల నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆదివారం కూడా చేతివాటం ప్రదర్శిం చినట్లు పోలీసుల విచారణలో తేలింది.

● వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో 36 సీసీ కెమెరాలు ఉన్నాయి. భక్తులు ఎక్కువ సంచ రించే ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆలయాధికారులు చెబుతు న్నప్పటికీ నగదు చోరీ జరగడం కలకలం సృష్టిస్తుంది. 36 సీసీ కెమెరాల్లో కొన్ని పనిచేయడం లేదని ఎస్‌పీఎఫ్ సిబ్బంది తెలుపగా ఆలయాధికారులు అన్ని పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి హుండీలకు పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రెండు రోజులు సెలవులు కావడంతో ఆలయానికి గురువారం భక్తుల రద్దీ మరింత పెరిగింది. రాజన్న దర్శనం కోసం భక్తులు తెల్లవారు జామునే ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం క్యూలైన్‌లో వెళ్లే భక్తులకు, కోడెమొక్కు క్యూలైన్‌లో వెళ్లిన భక్తులకు సుమారుగా రెండు గంటల సమయం పట్టింది. శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు శ్రీపార్వతిప రమేశ్వరులను దర్శించుకుని తరించారు. అనంతరం రాజన్నకు కోడెమొక్కును చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో ప్ర త్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఏఈవో శ్రావణ్, సూపరిండెంట్ తిరుపతి రావు, రాజేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్న ఆలయ పరిసరాల్లో సంప్రోక్షణ

- ఆలయ అర్చకులచే పుణ్యవచనము

వేములవాడ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలో మాంసాహారంతో కూడిన ఆహార ప్యాకెట్లు పట్టుబడటం కలకలం సృష్టించింది. దీనిపై బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూపరిండెండెంట్ వరి నర్సయ్య ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ పశ్చిమం వైపు గల ఖాళీ స్థలంలో సంప్రోక్షణ నిర్వహించి శుద్ధి చేశారు. అంతే కాకుండా ఆలయంలో పుణ్యవచనం చేపట్టినట్లు తెలిపారు.



రాజన్న ఆలయ పరిసరాల్లో సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు

అంజన్న భక్తుల కోసం వీల్ చైర్స్ అందజేత



వీల్ చైర్స్ అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

మల్యాల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చే దివ్యాంగుల భక్తుల సౌకర్యార్థం కరీంనగర్ లయన్స్ క్లబ్ దాతలు యూఎస్ఏలో ఉండే గూడ హర్షిత్‌రెడ్డి సహకారంతో గురువారం ఆరు వీల్‌చైర్స్ అందజేశారు. స్వామి వారి దర్శనం కోసం దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులు తొలగించడానికి వీల్‌చైర్స్ అందిం చినట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్య వేక్షకులు చంద్రశేఖర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందరరెడ్డి, దర్మేందర్‌తో పాటు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శరత్‌కృష్ణ, గవర్నర్ సురేశ్, సెక్రటరీ శివకాంత్, రాంబాబు, రాజేందర్, వేణు, చక్రపాణి పాల్గొన్నారు

● బుల్లితెర నటుల పూజలు

కొండగట్టు ఆంజనేయస్వామిని గురువారం పలువురు బుల్లితెర నటులు దర్శించుకున్నారు. ఫిష్ వెంకట్‌తో పాటు పలువురు అంజన్నను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంభీరావుపేట డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) ముస్తఫానగర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సమాచారం మేరకు గాలించి ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 8,850 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

నాలుగేళ్లుగా నిలిచిన 'అమ్మ ఒడి'



● లబ్ధిదారులకు అందని డబ్బులు ● ఆసుపత్రి చుట్టూ ప్రదక్షిణలు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు చేయించుకున్న వారి కోసం ప్రవేశపెట్టిన 'అమ్మ ఒడి' నాలుగేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగ శిశువు పుడితే రూ.12 వేలు ఇస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. అయితే నాలుగేళ్లుగా నిలిచిపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. ఖాతాల్లో డబ్బులు ఎప్పుడు వేస్తారంటూ ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 2017లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకం నాలుగు సంవత్సరాలు నిర్విరామంగా కొనసాగినా 2021 నుంచి బడ్జెట్ కేటాయించకపోవడంతో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకుంటే అమ్మఒడి పథకం కింద మూడు విడతల్లో ఖాతాలో జమ చేసేవారు. 2001వరకు 8,622మందికి రూ.3.87కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయి. 2021 నుంచి ఇప్పటి వరకు 6,07మంది లబ్ధిదారులు అర్హులు కాగా, వారికి ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదు. డబ్బులు వస్తాయనే ఆశతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి చుట్టూ లబ్ధిదారులు రోజూ తిరిగిపోతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సమాధానం చెప్పకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతు న్నారు.

గత ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకాన్ని యథావిధిగా కొనసాగి స్తున్నప్పటికీ బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటా యించడం లేదు. ఇటీవల వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూడా అమ్మ ఒడి పథకంపై సమీక్షించినట్టు తెలిసింది. లబ్ధిదారులకు రావాల్సిన బకాయిలు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు మొత్తం 2,500 డెలి వరీలు కాగా, అందులో 2140మంది అర్హులయ్యారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మొత్తం 2,368 డెలివరీలు కాగా, అందులో 1964మంది అర్హులయ్యారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మొత్తం 2,075 డెలివరీలు కాగా, అందులో 1414మంది అర్హులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబరు 1 వరకు మొత్తం 1,089 డెలివరీలు కాగా, అందులో 589మంది అర్హులయ్యారు. మొత్తం 6,107మంది అర్హులయ్యారు. వీరికి రూ.7.63 కోట్లు లబ్ధిదారులకు బకాయి ఉంది. అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టిన తరు వాత ప్రభుత్వాసు పత్రుల్లో ప్రసవాల సంఖ్య భారీగానే పెరిగింది. నాలుగేళ్ల పాటు సజావుగా సాగిన ఈ పథకం 2021 నుంచి బడ్జెట్ కేటాయించకపోవడంతో బ్యాంకు ల్లో డబ్బులు జమకావడం లేదు. ఇప్పటి కైనా ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని యథా విధిగా కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న డబ్బులను వెంటనే జమ చేయాలని కోరుతున్నారు.

బీజేపీ నాయకులు అంబేద్కర్‌ను అవమానించడం సరికాదు



రామడుగు మండలం షానగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సుంకె రవిశంకర్

రామడుగు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడడం సరికాదని స్వేరోస్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని షానగర్‌లో గురువారం అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ప్రవీణ్‌కుమార్ ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ పాటుపడ్డారని చెప్పారు. అంబేద్కర్ విధానం ప్రతి గ్రామంలో విస్తరింపజేయాలన్నారు. బీజేపీ నాయకులు అంబేద్కర్‌ను ఇష్టానుసారంగా అవమానపరుస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ విధానాన్ని మానుకోవాలన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్న అమిత్‌షా అంబేద్కర్ విధానాలను తప్పుగా అభివర్ణించడం దుర దృష్టకరమని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోని ఎక్కడా లేని విధం గానసచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం అభినందనీయని తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు పంకిటి శేఖర్, స్వేరో జిల్లా అధ్యక్షుడు పర్లపల్లి మనోజ్‌కుమార్, నాగిశేఖర్, కొంకిటి శేఖర్, కలిగేటి కవిత, లక్ష్మణ్, గడ్డం నాగరాజు, కరుణాకర్, అశోక్, సుందరం, రమేశ్ పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ధర్మారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్ తెలిపారు. అథ్లెటిక్ విభాగంలో ఎంపికైన టీ మనోజ్ఞ, ఆర్ పవిత్ర, ఓ సౌజ్ఞశ్రీలు ఈనెల 31 నుంచి జనవరి 2 వరకు హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఫుట్‌బాల్ విభాగంలో ఎంపికైన బి అక్షిత, జి అశ్విత, ఎం వైష్ణవి, హర్షినీ, రచనలు రంగారెడ్డి జిల్లా హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఈనెల 27 నుంచి 29 వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హ్యాండ్ బాల్ విభాగంలో ఎంపికైన వైశాలి ఈనెల 27 హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుండగా, సాఫ్ట్ బాల్ విభాగంలో బి వైష్ణవి మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నది. ఎంపికైన విద్యార్థినులను ప్రిని పాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవ్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు..

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సీఎం కప్ 2024 హ్యాండ్‌బాల్ క్రీడాపోటీలకు పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సంయుక్త, స్వర్ణలతలు ఎంపికైనట్లు పీఈటీ సురేందర్ తెలిపారు. ఈనెల 27 నుంచి 30 వరకు హన్మకొండలో జరిగే సీఎం కప్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు రామేశ్వర్, అశోక్, రాజేశ్వర్‌రావు, జ్యోతి, వాసంతి, మంజుల, శ్రీనివాస్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు..

ఇల్లంతకుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న జెట్టి కీర్తన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు ఒక ప్రకటనలో తెలిపారు.మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న కీర్తనను ప్రధానోపాధ్యాయిని పావని, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ సంపత్‌రావు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పద్మశ్రీనివాస్‌లు అభినందనలు తెలిపారు.

సీఎంకప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ..

చొప్పదండి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని ఉడుత రిత్విక సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాలసాని రాజ్‌కుమార్ తెలిపారు. సీఎంకప్ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహిస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు.

కర్రసాముతో స్వీయ రక్షణ



కర్రసాము శిక్షణలో మహిళలు, యువతులు

- ఆసక్తి చూపుతున్న యువతులు, మహిళలు
- స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామాల్లో యువకులు మాత్రమే కర్రసాము నేర్చుకునేవారు. ఇప్పుడు మహిళలు, యువతులు, బాలికలు స్వీయ రక్షణ కోసం సంప్రదాయ కళైన కర్రసాములో శిక్షణ తీసుకుంటున్నారు. స్వీయ రక్షణతోపాటు శారీక ధృఢత్వం, క్రమ శిక్షణ పెంపొందించుకోవడానికి కర్రసాము దోహదపడుతుంది. దీంతో పాఠశాలలకు వెళ్లే బాలికల నుంచి కళాశాలల యువతులు, ఉద్యోగాలు చేసే మహిళలు కర్రసాము నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, విద్యార్థినులు పలు చోట్ల భౌతిక దాడులకు గురవుతున్న సందర్భాలు కన్పిస్తున్నాయి. ఇలాంటి సంఘటలు చోటు చేసుకున్నప్పుడు మహిళలకు స్వీయరక్షణ తప్పనిసరని భావిస్తున్నారు. తమను తాము కాపాడుకోవాలన్న ఆలోచనతో చాలా మంది ఆత్మరక్షణ కోసం కరాటే, కర్రసాము వంటివాటిల్లో శిక్షణపై ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. ప్రతీ ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సంస్థ ప్రతినిధులు తిరుమల, అన్నపూర్ణ పర్యవేక్షణలో మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ వడ్నాల శ్రీనివాస్ కర్రసాములో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. రానున్న రోజుల్లో జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో బాలికలకు కర్రసాములో శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెపారు.



కర్రసాము ఆత్మరక్షణ
- కనుకుంట్ల సంజన, మెడికో, సిరిసిల్ల

కర్రసాము శిక్షణ మనకు ఆత్మరక్షణ. ఎవరో వస్తారని మనల్ని కాపాడుతారని ఎదురు చూసే బదులు కర్రసాము, కరాటే నేర్చుకుంటే మన రక్షణ మనమే చూసుకోగలం. ఆత్మరక్షణకు ఉపయోగపడే కర్రసాము విద్యను నేను నేర్చుకున్నాను. ఇతురులకు కూడా నేర్పిస్తున్నాను. ప్రస్తుత కాలంలో స్వీయరక్షణ తప్పనిసరి.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే
- తంపుల గీత, సెస్ ఉద్యోగి, సిరిసిల్ల



మనలో పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే. హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కర్రసాము నేర్చుకుంటున్నాను. మొదట్లో నాకు రాదేమో అనే సందేహం కలిగింది. ప్రస్తుతం రెండు కర్రలతో కూడా ఫైట్ చేస్తున్నాను. కర్రసాముతోనే నాలో ధైర్యం పెరిగింది.


కర్రసాముపై అవగాహన రావాలి
- కనుకట్ల తిరుమల, హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి

మహిళలు, యువతులు, బాలికలకు కర్రసాముపై అవగాహన రావాలి. జిల్లాలోని మహిళలకు, యువతులకు, బాలికలకు ఉచితంగా కర్రసాము నేర్పించాలన్న లక్ష్యంగా పని చేస్తున్నాం. నాలుగు నెలలుగా దాదాపు 200 మందికి శిక్షణ అందించాం. 2025 జనవరి నుంచి కళాశాలలోని బాలికలకు, యువతులకు కర్రసాము శిక్షణను ప్రారంభిస్తాం.

కర్రసాము ప్రత్యేక విద్య
- వడ్నాల శ్రీనివాస్, మాస్టర్, సిరిసిల్ల

కర్రసాము ప్రత్యేకమైన విద్య. ఆత్మరక్షణలో కర్రసాముకు తిరుగు లేదు. పేదవారికి ఎలాంటి ఖర్చులు లేని విద్య. ఆత్మరక్షణ కోసం కర్రసామును ప్రతీ ఒక్కరు నేర్చుకోవచ్చు. కర్రసాములో 14 రకాల ప్రక్రియలు ఉంటాయి. హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా మహిళలు, యువతులు, బాలికలు నేర్చుకోవడం కోసం ఆసక్తి చూపుతున్నారు. ఆత్మరక్షణ కోసం అందరికీ నేర్పించాలనే సదుద్దేశంతో పని చేస్తున్నా





కర్రసాము శిక్షణలో జంపు చేస్తున్న బాలిక



కర్రసాము చేస్తున్న యువతులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- మరో ముగ్గురికి గాయాలు



మంగ(ఫైల్)

బోయినపల్లి/తిమ్మాపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి సమీపంలో గురువారం ఉదయం డ్రైవర్ లారీని అజాగ్రత్తగా రోడ్డుపై పార్కింగ్ చేయగా కారు అదుపుతప్పి ఢీకొన్న ప్రమాదంలో తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామానికి చెందిన మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదంలో మరో ముగ్గురికి గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు. బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్‌గౌడ్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాత్మానగర్‌కి చెందిన పోలవేణి గట్టుబాబు, అతడి భార్య పోలవేణి మంగ, మడిశెట్టి అశోక్, అతడి భార్య మడిశెట్టి అహల్య గురువారం తెల్లవారుజామున వేములవాడలో బంధువుల ఇంట్లో నిర్వహించిన శుభకార్యానికి కారులో వెళ్లారు. తిరిగి కారులో బంధువులతో కలిసి కరీంనగర్ వైపు వెళ్తున్నారు. వెంకట్రావుపల్లి సమీపాన ఓ లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపాడు. కారును డ్రైవింగ్ చేస్తున్న గట్టుబాబు రోడ్డుపై నిలిపిన కారును గమనించకుండా వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మంగ(50) మృతిచెందింది. గట్టుబాబు, అశోక్, అహల్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కరీంనగర్‌కు తరలించారు. గట్టుబాబు, అశోక్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. గట్టుబాబు, అశోక్ ఇద్దరు బావ, బావమరుదులు, ఇద్దరు అయ్యప్ప దీక్షలో ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇల్లందకుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి రాజేష్ (40) మృతి చెందాడు. ఎస్‌ఐ రాజకుమార్ వివరాల ప్రకారం.. రాజేష్ మద్యానికి బానిసై బుధవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. స్థానికులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి జూడో పోటీలు

- ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్
- హాజరు కానున్న 33 జిల్లాల క్రీడాకారులు



వసతి సౌకర్యాలను పరిశీలిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీఎం కప్ జూడో పోటీలు శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించనున్నారు. అనంతరం మూడు రోజుల పాటు ఈ పోటీలను జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన క్రీడాకారులు, కోచ్, మేనేజర్లు, టెక్నికల్ అఫీషియల్స్, ఇతరులు మొత్తం 800 మంది హాజరుకానున్నారు. వీరందరికీ కలెక్టర్ నేతృత్వంలో జిల్లా యువజన క్రీడాశాఖ, జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ పమేలా సత్పతి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా అధికారులు హాజరుకానున్నారు. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మ్యాట్లతో కూడిన రెండు క్రీడా కోర్టులను ఏర్పాటు చేశారు.

● ఏర్పాట్లను పరిశీలించిన డీవైఎస్‌వో

సీఎం కప్ జూడో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను గురువారం రాష్ట్ర జూడో సంఘం ప్రతినిధి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు తుమ్మల రమేశ్ రెడ్డి, కదారి అనంతరెడ్డి, డీవైఎస్‌వో వి.శ్రీనివాస్‌గౌడ్‌లు పరిశీలించారు. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జూడో అకాడమీని, క్రీడాకారులకు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను, భోజనశాలలను పరిశీలించారు. క్రీడాకారులకు చలికాలంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు చేయాల్సిన ఏర్పాట్ల గురించి చర్చించారు. ప్రతిరోజు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు ఉదయం అరటిపండు, గుడ్డు, అల్పాహారం అందించనున్నారు.

ఘనంగా నిర్వహిస్తాం



సీఎం కప్ జూడో పోటీలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. ప్రాంతీయ క్రీడా పాఠశాలలో పోటీలను నిర్వహిస్తాం. రెండు కోర్టులను మ్యాట్లతో ఏర్పాటు చేశాం.

- జూడో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి

అన్ని ఏర్పాట్లు చేశాం



జూడో పోటీలను విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి క్రీడాకారులు, అధికారులు, టెక్నికల్ అఫీషియల్స్ కూడా హాజరవుతారు.

- డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

ఆదాయ పన్ను పరిమితి రూ.15 లక్షలకు పెంచాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గోవిందునాయక్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగస్తుల ఆదాయ పన్ను పరిమితి రూ.15 లక్షలకు పెంచాలని, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గోవిందునాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం టీజీఎస్ జగిత్యాల జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 60 శాతంతో కూడిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సర్వీసు రూల్స్ రూపొందించి ఎంఈవో, డిప్యూటీ ఈవో డైట్ లెక్చరర్ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలని కోరారు. అలాగే 24 సంవత్సరాల సర్వీసు పూర్తయినవారికి గెజిటెడ్ హోదా లభించని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన అన్నారు. ఈ సందర్భంగా సర్వ శిక్ష అభియాన్ సమ్మె దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు, కార్యదర్శి జరుపుల గోవింద్, రమేష్ రాథోడ్, రఘు, ప్రకాష్, మోతీలాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ సమావేశానికి జీవన్‌రెడ్డికి ఆహ్వానం

జగిత్యాల, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాంలో శుక్రవారం జరుగనున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆహ్వానం అందినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం తెలిపారు. జాతీయ స్థాయిలో పార్టీ పటిష్ఠతతో పాటు భవిష్యత్‌లో పార్టీ పరంగా తీసుకునే నిర్ణయాలను ఈ సమావేశంలో చర్చిస్తారని అలాంటి సమావేశానికి జీవన్‌రెడ్డిని ఆహ్వానించడం పట్ల కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టీ విక్రమార్కకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శతచండీ మహా సుదర్శన యాగం

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శతచండీ మహాసుదర్శన నారసింహ యాగాన్ని పురోహితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువరం ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు తదితర కార్యక్రమాలను చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీచక్రపాణి వామనాచార్యులు ఆధ్వర్యంలో నలభై మంది వేదపండితులతో నిర్వహించిన యాగంలో పెద్ద సంఖ్యలో భక్తులు తమ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితులు హరితీర్థస్వామి, చక్రపాణి వామనాచార్యుల వేదమంత్రోత్సవాల మధ్య యాగశాల ప్రవేశం, కర్మణ పుణ్యామండలము, దిక్ దేవతాస్థాపనములు, బ్రహ్మకలశ స్థాపనము, చండీపారాయణము, సుదర్శన పారాయణము, అగ్ని ప్రతిష్ఠా, హవనములు వంటి తదితర కార్యక్రమాలను భక్తులచే ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థం, అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ, గ్రామాభివృద్ధి కమిటి నాయకులు, సభ్యులు, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో చండీయాగం నిర్వహిస్తున్న పురోహితులు

ఏళ్లు గడుస్తున్నా.. కాలయాపనే

- కోట్లు వెచ్చించి రోళ్లవాగు ఆధునికీకరణ పనులు ప్రారంభం
- అప్పుడే బయటపడుతున్న నాణ్యతా లోపాలు
- రెవెన్యూ శాఖ నుంచి అటవీ శాఖకు భూముల అప్పగింత..



ఆధునీకరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టు కట్ట

బీర్‌పూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని రైతులకు వరప్రదాయినిగా ఉన్న రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనుల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి పనులు ప్రారంభించినప్పటికీ ఏళ్లు గడుస్తున్నా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల నాసిరకపు పనుల వలన అప్పుడే లోపాలు భయట పడుతున్నాయి. దీంతో రెండు మండలాల రైతులు తమకు సాగు నీరు అందకముందే కట్ట పనుల్లో పగుళ్లు వచ్చి దర్శనమివ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పనులు పూర్తి చేయడంలో అధికారుల, కాంట్రాక్టర్లు చెబుతున్న సాకులకు మరో అవకాశంగా అటవీ అనుమతులు రాకపోవడం కాలయాపనకు కలిసొస్తోంది..



నాసిరకపు కట్టపై ఏర్పడిన నెర్రెలు

బీర్‌పూర్, ధర్మపురి మండలాల రైతుల చివరి ఆయకట్టు వరకు నీరందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికరణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. ఇప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు చేరక రైతులకు సాగునీటి కష్టాలు తప్పడంలేదు. పనులు చివరి దశకు చేరుకున్నప్పటికీ రెండేళ్లుగా అటవీ అధికారుల అభ్యంతరాలతో తూములకు షట్టర్లు బిగింపు లేక నీటిని నిలువ చేయక చివరి గ్రామాలకు నీరందడం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇటీవల కొంత అటవీ అనుమతి పనులు వేగవంతమయ్యాయి. ప్రాజెక్టు ఆధునీకరణలో 810 ఎకరాలు ముంపునకు గురవుతుండగా 53 వేల చెట్లు ఉన్నట్లు గుర్తించారు. ఆయా అటవీ భూములకు బదులు ఇతర మండలాల్లో ఎంపిక చేసిన 335 హెక్టార్ల రెవెన్యూ భూములను అటవీశాఖకు అప్పగించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయికి నివేదిక వెళ్లగా అక్కడి నుంచి అధికారులు పరిశీలనకు రానున్నారు. ఆ తరువాత కేంద్రానికి అనుమతి కోసం పంపించనున్నారు. అయితే రెండేళ్లుగా తూముకు షట్టర్లు బిగించకపోవడంతో నీటిని నిలువ చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. మిగులు పనులు చేపట్టకుండా అటవీ అధికారులు అడ్డు చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. అటవీ అనుమతులు పూర్తయితే కానీ పనులు ప్రారంభించే వీలులేదు. ప్రస్తుతం యాసంగి పంటకు చివరి ఆయకట్టుకు నీరందించడం కష్టంగా మారనుంది.



మత్తడికి కుడి పక్కన భారీ వర్షాలకు కొట్టుక పోయిన కయ్యా

● అనుమతులు వచ్చేలోపు మిగులు పనులు చేపట్టాలి...

అటవీశాఖ అనుమతులు వచ్చేలోపు మిగులు పనులు చేపడితే యాసంగి పంటకైనా రైతులకు సాగునీరు అందించే అవకావంఉంటుంది. తూములు ఏర్పాటు చేసిన అధికారులు అటవీ అనుమతులు లేవని ఇప్పటివరకు షట్టర్లు ఏర్పాటు చేయక కాలయాపన చేస్తూ వస్తున్నారు. అనుమతులు ఆలస్యం అయితే ప్రాజెక్టులో నీరు అధికంగా చేరినప్పటికీ షట్టర్లు పైకి లేపి నీటిని దిగువకు వదిలే అవకాశం ఉంటుంది. రుండవదిగా చెర్లపల్లి వైపు ఏర్పాటు చేసిన మత్తడికి కుడివైపున గతంలో వచ్చిన భారీ వర్షాల కారణంగా గండిపడి పూర్తిగా కొట్టుకు పోయింది. దీంతో పై నుంచి వచ్చే నీరు నిలువ ఉండే అవకాశాలు లేవు. మత్తడికి కుడివైపు తెగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించి నీరు నిలువ ఉండే విధంగా వెంటనే చర్యలు చేపడితే వచ్చే యాసంగికైనా రైతులకు నీరు అందించే అవకాశం ఉంటుంది. కట్టపై ఏర్పడుతున్న పగుళ్లు భారీ వర్షాలకు కృంగిపోయే ప్రమాదం ఉంది. గతంలో లాగే మళ్లీ ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు అధికారులు స్పందించి పగుళ్లు వచ్చిన ప్రాంతాన్ని పరిశీలించి తగు పరిష్కారాలు చేపట్టి భవిషత్తులో కట్టకు ముంపు లేకుండా చూడాలి.

న్యూస్ బాక్స్

పోస్టర్ల ఆవిష్కరణ

పాలకుర్తి, అంతర్గాం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం న్యూడెమోక్రసీ నాయకులు వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ మండల కార్యదర్శి కొల్లూరి మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు చంద్రయ్య పాల్గొన్నారు. ఈనెల28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే న్యూడెమోక్రసీ పార్టీ విలీన సభను విజయవంతం చేయాలన్నారు. ప్రజలు,పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పీవైఎల్ నాయకుడు అరుమూళ్ల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మెట తిరుపతి, అఫ్జల్, రాజు, రమేష్, మల్లయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముత్తారం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దుండే రాజేశం మరణించగా పార్థివ దేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య,మైనార్టీ మండల అధ్యక్షుడు వాజిద్ పాషా, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.

గోదావరిఖని ఆర్టీసీ డిపోలో పాముల సంచారం..

- భయాందోళనలో ఉద్యోగులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్టీసీ డిపోలో పాముల సంచారంతో ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల తెల్లవారుజామున డిపోలో డీజిల్ బంక్‌లో పనిచేస్తున్న ప్రసాద్ అనే వ్యక్తి నాగుపాము కాటు వేసింది. అతనికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. గతకొద్ది రోజులుగా ఆర్టీసీ డిపోలో పాముల సంచారం పెరిగిపోయింది. డిపో గోడ అవతలి వైపు పిచ్చిమొక్కలు పెరగడంతో పాములు డిపోలోని గ్యారేజీలకు వస్తున్నాయి. 15 రోజుల క్రితం ఓ మెకానిక్ నైట్ షిఫ్టు సమయంలో గ్యారేజీ ఆవరణలోకి పాము కనిపించడంతో పరుగులు తీశాడు. గ్యారేజీల్లో ఉన్న ఇనుప వస్తువుల వద్ద పాములు ఎక్కువగా ఉంటున్నాయి. మెయిన్‌గేట్ వద్ద ఉన్న సెక్యూరిటీ చెక్‌పోస్టు వద్దకు కూడా ఓ నాగుపాము రావడంతో సెక్యూరిటీ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. డిపో మేనేజర్ పాములు పట్టే వ్యక్తిని పిలిపించినా కాటు వేసిన పాము దొరకక పోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగులు తమ మోటార్‌సైకిళ్లను డిపో ఆవరణలోని షెడ్డులో పార్కింగ్ చేసి విధు లకు హాజరవుతుండడంతో ఇటీవల ఓ పాము మోటార్‌సైకిల్ స్టాండ్ వద్ద కనిపించిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. బస్ డిపో చుట్టు పక్కల పిచ్చి మొక్కలు పెరగడంతో తరచూ పాములు డిపో ఆవరణలోకి వస్తుండడంతో ఉద్యోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాములు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఉద్యోగులు కోరుతున్నారు.

నేడు అయ్యప్ప స్వామికి మహా పుష్పాభిషేకం

మంథని, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మహా పుష్పాభిషేకాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆలయంలో మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలతోపాటు ఉత్సవ మూర్తికి గోదావరినది తీరంలో చక్రస్నానం అనంతరం ఆలయంలోని స్వామివారికి ఉదయం 8.30 గంటలకు మహా పుష్పాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హారతి, తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.

నియామకం

ఎలిగేడు, డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధూళికట్టకు చెందిన ఏబీవీపీ స్టూడెంట్ ఫర్‌సేవా స్టేట్ కోకన్వీనర్‌గా సందవేణి ఓమేష్‌ను నియమిస్తూ రాష్ట్రఅధ్యక్షుడు జానారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

గోదావరిఖనిలో నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ చలాన్లు

- నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ పేరిట ఎలక్ట్రిక్ బైక్‌లకు పెనాల్టీలు - ఆందోళనలో వాహనదారులు



నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేశారంటూ ఫైన్ విధించిన ఫొటో

కోల్‌సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని పట్టణంలో వాహనచోదకులకు నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ చలాన్లు పడుతున్నాయి. వివిధ కూడళ్లలో పోలీసులు బైక్‌లను ఫొటోలు తీస్తూ ఏదో రకంగా చలాన్లు జనరేట్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాలనీల్లో సైతం తిరుగుతూ షాపుల ముందున్న బైక్‌ల ఫొటోలు తీస్తూ చలాన్లు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బయటకు వస్తే పెనాల్టీలు పడతాయనే ఆందోళనలు కార్మికవాడల్లో వ్యక్తమవుతున్నాయి. ఇక లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ వంటి వ్యాపార ప్రాంతాల్లో పరిస్థితులు మరీ అధ్వానంగా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. గోదావరిఖని మెయిన్ చౌరస్తా, శివాజీనగర్ పూల దుకాణాల సమీపంలో ఉంటున్న పోలీసులు షాపింగ్‌కు వస్తున్న వారి బైక్‌లను ఆపి మరీ చలాన్లు వేయడం, చలాన్లు కట్టించుకుంటున్నారు. ఇటీవల ఒక సింగరేణి కార్మికుడు ఎలక్ట్రిక్ బైక్‌పై వెళ్లగా రెండుసార్లు పెనాల్టీ వేశారు. అది కూడా నంబర్ ట్యాంపరింగ్ చేశారనే కారణంతో పెనాల్టీలు విధించారు. వాస్తవానికి సదరు బైక్‌కు నంబర్ ప్లేట్ స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడా ట్యాంపరింగ్ చేసిన ఆనవాళ్లు కూడా లేవు. నిర్ణీత సామర్థ్యం గల ఎలక్ట్రిక్ బైక్‌లకు రిజిస్ట్రేషన్ చేసుకునే విషయంలోనే వెసులుబాట్లు ఉన్నాయి. 100సీసీ, ఆపై సామర్థ్యం ఉన్న



ఈ-చలాన్ సైట్‌లో ఎలక్ట్రిక్ బైక్ నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ పేరిట విధించి ఫైన్

బైక్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశారు. ఇలాంటి బైక్‌లకు నంబర్ ప్లేట్లు ట్యాంపరింగ్ చేస్తున్నారని పెనాల్టీలు వేస్తున్నారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్‌ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీనికి తోడు పార్కింగ్ సౌకర్యం కూడా లేదు. ఈ క్రమంలో పోలీసులు ఉంటున్నారనే భయంతో కస్టమర్ల రాక గిరాకీ తగ్గిందని వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



ఎలాంటి ట్యాంపరింగ్ లేకుండా ఉన్న బైక్ నంబర్ ప్లేట్

కాంగ్రెస్‌దే పైచేయి..

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులు దక్కాయి. గోదావరిఖనికి చెందిన హర్కార వేణుగోపాల్‌రావుకు కేబినెట్ హోదాగల ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్), ఐఎన్‌టీయూసీ నాయకులు జనక్‌ప్రసాద్‌కు కనీస వేతనాల కమిటీ సలహా మండలి చైర్మన్ పదవి వరించింది. జిల్లా స్థాయిలో సుల్తానాబాద్‌కు చెందిన అంతటి అన్నయ్యగౌడ్‌కు జిల్లా గ్రంథాలయ పదవి దక్కింది. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో గల పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ధర్మపురి పరిధిలోని ధర్మారం మార్కెట్‌లకు పాలకవర్గాలను నియమించగా, మంథని, కమాన్‌పూర్, రామగుండం మార్కెట్లకు కమిటీలను నియమించాల్సి ఉంది.

● రెండు మున్సిపాలిటీలు హస్తగతం..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులు చక్రం తిప్పి సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలను హస్తగతం చేసుకున్నారు. సుల్తానాబాద్ చైర్మన్‌గా ఉన్న ముత్యం సునీత, మంథని చైర్మన్‌గా ఉన్న పుట్ట శైలజలపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లను తమ పార్టీలో చేర్చుకుని అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టి తమ వాళ్లకు చైర్మన్ పదవులు దక్కేలా చేశారు. సుల్తానాబాద్ చైర్‌పర్సన్‌గా గాజుల లక్ష్మి, మంథని చైర్‌పర్సన్‌గా పెండ్రు రమాదేవి ఎన్నికయ్యారు.



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్(ఫైల్)

● బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు..

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తున్నది. పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థయిర్యం చెదరకుండా ఉండేందుకు బీఆర్ఎస్ నాయకులు పార్టీ ఆదేశాల మేరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించేందుకు నవంబరు 29న దీక్షా దివస్ నిర్వహించగా, పూర్తి స్థాయిలకు రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతు బంధు పథకాన్ని తుంగలో తొక్కిందని విమర్శిస్తూ కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకవెళుతున్నారు. ఏడాది పాలన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాలు నిర్వహిస్తూ, బీఆర్ఎస్ అందుకు విరుద్ధంగా నిరసనలు చేపట్టారు. జిల్లా పార్టీని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, కోరుకంటి చందర్‌లను సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకవెళుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ బలం నిరూపించుకోవాలని చూస్తున్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు దుగ్యాల ప్రదీప్‌కుమార్(ఫైల్)

● బీజేపీకి పెరిగిన ఓట్లు..

కేంద్రంలో వరుసగా మూడోసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ, జిల్లాలో ఆ పార్టీ జోరు పెరగడం లేదు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల శాతాన్ని సాధించిన బీజేపీ దానిని నిలబెట్టుకునేందుకు చర్యలు చేపట్టడం లేదు. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను చేపట్టడం లేదు. ఎప్పటిలాగానే అందరి నాయకుల మధ్య సమన్వయం కొరవడింది. క్షేత్రస్థాయిలో కొంత బీజేపీ గాలి వీస్తున్నప్పటికీ, దానిని అందిపుచ్చుకునేందుకు చర్యలు చేపట్టడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆరాట పడుతున్నది. పార్టీకి చెందిన అందరు నాయకులను సమన్వయ పరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటే అవకాశాలు లేకపోలేదు.

చివరి ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు

- మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు కాలువలు శుభ్రం చేయిస్తున్నట్లు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. గురువారం 83ఎస్సారెస్పీ కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు వేసవిలో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందేలా పెద్దపల్లి మండలం నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలం వరకు ఉన్న డి83 కాలువలు శుభ్రం చేయించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఎస్సారెస్పీ కాలువలో ఉన్న పిచ్చి మొక్కలు, చెట్లు తొలగించి అక్కడక్కడా మరమ్మతులు కూడా చేయించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజనవేణ సదయ్య, ఎస్సారెస్పీ అధికారులు ఉన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



సీపీఐ సభ్యత్వాన్ని అందజేస్తున్న గోవర్ధన్

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు ఎల్ ప్రకాష్ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యవర్గ సభ్యుడు గౌతం గోవర్ధన్ మాట్లాడారు. ప్రజల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. సీపీఐ 100 ఏళ్ల ప్రస్థానంలో నిరంతర ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ, పాలకులు దిగివచ్చి ప్రజాసమస్యల పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు గోవర్ధన్ పేర్కొన్నారు. సీపీఐకి అనుబంధంగా విద్యార్థి, మహిళా, కార్మిక, రైతు, ఉద్యోగ సంఘాలుగా అనేక శాఖలు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన వారికి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రాజారత్నం, జీ రవీందర్, అన్నారావు, బుర్ర తిరుపతి, రవికుమార్, గట్టయ్య, పోచన్న పాల్గొన్నారు.

భూములు పంచిన చరిత్ర విప్లవ పార్టీలది..

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది మందికి భూములను ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర విప్లవ పార్టీలదని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఈదునూరి రామకృష్ణ, ఈసంపల్లి రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 28న జరిగే న్యూడెమోక్రసీ పార్టీల విలీనం సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం తిలక్‌నగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిన్నచిన్న విభేదాలతో విడిపోయినా ఇప్పుడు పార్టీలు విలీనం కావాల్సి ఉందన్నారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివాసీలను అడ వుల నుంచి గెంటివేయాలని ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. నూతన చట్టాలను తీసుకువచ్చి దేశంలోని కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుండేటి మల్లేష్, చింతల శేఖర్, ప్రసాద్, సంపత్, అవినాష్, రాజేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోస్టుమార్టం గది..

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పోస్టుమార్టం గది మరమ్మతులకు నోచుకోవడం లేదు. 1972లో మాజీ ఎమ్మెల్యే కాల్వ రామచంద్రారెడ్డి కాల్వశ్రీరాంపూర్ సర్పంచ్‌గా ఉన్న సమయంలో ప్రైమరీ హెల్త్‌సెంటర్ ఏర్పాటుచేశారు. కాల్వశ్రీరాంపూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్యం అందించేవారు. అప్పట్లో ఆరుపడకల ప్రభుత్వ ఆసుపత్రికి పక్కా భవనం ఉండేది. ఈ ప్రాంతంలో 30పడకల ఆసుపత్రి చేయాలని ఆలోచనతో మండలంలోని గంగారం గ్రామానికి చెందిన అప్పటి ఎమ్మెల్యే జిన్న మల్లారెడ్డి, కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే కాల్వ రామచంద్రారెడ్డి 1979లో 30 పడకల ఆసుపత్రిని మంజూరుచేయించారు. ఆసుపత్రి నిర్మాణానికి తన రెండు ఎకరాల వ్యవసాయ భూమిని విరాళంగా ఇచ్చారు. రెండేళ్లలో ఆసుపత్రితో పాటు సిబ్బంది ఉండేందుకు క్వార్టర్స్, పోస్టుమార్టం గదిని నిర్మించారు. కాల్వశ్రీరాంపూర్‌లోనే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేవారు. కాల్వ రాంచంద్రారెడ్డి జీవించి ఉన్నన్ని రోజులు ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా జరిగింది. అనారోగ్య కారణాల వల్ల 1992 జనవరి 29న రాంచంద్రారెడ్డి మృతిచెందడంతో ఆసుపత్రి నిర్వహణ గాడితప్పింది. ప్రమాదవశాత్తు ఎవరైనా మృతి చెందితే ఇక్కడ పోస్టుమార్టం నిర్వహించేందుకు సరైన డాక్టర్ లేకపోవడంతో పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించడం పరిపాటిగా మారింది. పట్టించుకునే వారు లేకపోవడంతో పోస్టుమార్టం గది శిథిలావస్థకు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోస్టుమార్టం గదికి మరమ్మతులు చేపట్టాలని, ఇక్కడే పోస్టుమార్టం నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో శిథిలావస్థలో ఉన్న పోస్టుమార్టం గది

చెవిలో పువ్వులతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 17వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా గురువారం ఉద్యోగులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చి నేరవేర్చకపోవడంతో ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో జాక్ అధ్యక్షుడు తిప్పని తిరుపతి, కుంభాల సుధాకర్, శ్రీనివాస్, సంధ్యారాణి, రవిందర్, రహీం, శ్రావణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

ఎలిగేడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం ఎంపీవో ఎండీ ఆరీఫ్ పరిశీలించారు. మండలంలోని శివపల్లి, నర్సాపూర్, ధూళికట్ట, రాములపల్లి గ్రామాల్లో ఆరురోజులుగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలను తెలుసుకొని పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఒకటికి రెండుసార్లు ఇంటి యజమానులతో పూర్తి వివరాలు సేకరించాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలు తమ బయోడేటాను సర్వే అధికారులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శ్రవణ్‌కుమార్, లలిత, పున్నమయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర, అవయవదానంపై అవగాహన

ఓదెల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, శరీర, అవయవ దానాలపై అవగాహన కల్పించారు. ఇటీవల ఓదెలలో దివ్యాంగుడు బూర సదానందం మృతిచెందగా ఆయన ఇంటి వద్ద సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్మారక సభ నిర్వహించారు. ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మచారి మాట్లాడుతూ నేత్రదానం మహా పుణ్య కార్యమని, ప్రతి ఒక్కరు నేత్ర, శరీర, అవయదానాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం మృతుని కుటుంబానికి క్యాతం సత్యనారాయణ ప్రశంసాపత్రం అందజేశారు. జాతీయ అధ్యక్షుడు శ్రావస్ కుమార్, సలహాదారుడు నూక రమేష్, వాసు, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, మండల ఇన్చార్జి మల్లేశం, బైరి వినోద్, మేర్గు మల్లేశం పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

ఆర్జీ-2లో పర్యటించిన డైరెక్టర్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం, ఆపరేషన్స్) సత్యనారాయణరావు గురువారం ఆర్జీ-2 ఏరియాలో పర్యటించారు. ఓసీపీ-3 స్టోర్స్‌ని తనిఖీ చేసిన ఆయన స్టోర్స్ అధికారులతో సమావేశమయ్యారు. స్టోర్‌లో మెటీరియల్ భద్రపరిచే షెడ్‌లను పరిశీలించారు. మెటీరియల్ భద్రపరచడానికి అనువుగా షెడ్ల నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సీహెచ్‌పీలో నిర్మాణంలో ఉన్న బంకర్ పనులను పరిశీలించారు. బొగ్గు రవాణాకు అనుగుణంగా బంకర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓసీపీ-3 వ్యూపాయింట్ నుంచి పని స్థలాలను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, యంత్రాల వినియోగంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డిమాండ్‌కు తగిన విధంగా బొగ్గు ఉత్పత్తి చేయాలని, వార్షిక లక్ష్యాన్ని సాధించాలంటే రోజువారి టార్గెట్‌ను అధిగమించాలని సూచించారు. డైరెక్టర్ సత్యనారాయణరావు వెంట ఎక్స్‌ప్లోజివ్ జీఎం బైద్య, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, పీవో మధుసూదన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్ కుమార్, పీఈ విజయ్‌కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ్, ఎస్ఎస్ఓ షరీఫ్ హహమ్మద్ ఉన్నారు.

సొంతింటి పథకం అమలుచేయాలని ఆందోళన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ తలపెట్టిన ఆందోళనల్లో భాగంగా గురువారం ఆర్జీ-2 వర్క్‌షాప్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన నాయకులు గెలిచిన తర్వాత విస్మరించారని తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో అన్ని కార్మిక సంఘాలు సొంత ఇంటి పథకం అమలు చేయిస్తామని హామీ ఇచ్చాయని, ఇటీవల జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో గెలిచిన సంఘాలు ప్రస్తావించకపోవడం కార్మికులను నిరాశపరిచినట్టు ప్రవీణ్ పేర్కొన్నారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేలా సింగ రేణి యాజమాన్యం మీద, రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి అమలుచేయించే బాధ్యత గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలపై ఉన్నదని ప్రవీణ్ తెలిపారు. ఐక్య పోరాటాల ద్వారానే సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌మీద ఐటీ రీయింబర్స్, మారుపేర్ల మార్పిడి వంటివి పరిష్కారం అవుతాయన్నారు. ఐక్య పోరాటాలకు సీఐటీయూ సిద్ధమని తెలిపారు. ఈసందర్భంగా డిమాండ్లతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్ వెంకన్న, నాయకులు వినేష్, రాజేష్, తిరుపతి, శ్రావణ్, సంతోష్, కార్మికులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం : ఏఐటీయూసీ

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓసీపీ-3 సీహెచ్‌పీ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఏఐటీయూసీ నాయకులు జీ రవీందర్, ప్రకాష్, రాజారత్నం, అన్నారావు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఫైర్ కోల్, దుమ్ముతో పని చేయలేని స్థితి ఉన్నదని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని పేర్కొన్నారు. 16000టన్నుల బంకర్‌లో ఫైర్‌కోల్ వేడితో కాంక్రీట్ స్ట్రక్చర్ పగిలినా పట్టించుకునే దిక్కులేదని తెలిపారు. బొగ్గు రవాణా మీద ఉన్న దృష్టి రక్షణ, వసతుల కల్పనపై లేదన్నారు. ఆర్వో ప్లాంట్ 25 రోజుల క్రితం పాడైనా మరమ్మతు చేయించలేదని, ఫ్లో ఫీడర్‌లో నాలుగు నెలుగా నీరు నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. యాజమాన్యం స్పందించి సీహెచ్‌పీలో సమస్యలను పరిష్కరించాలని వారు ప్రకటనలో డిమాండ్ చేశారు.

సింగరేణి సమాచారం

విప్లవకారుల ఐక్యతతో ప్రజా ఉద్యమాలు బలోపేతం..



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విప్లవకారుల ఐక్యతతో ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం అవుతాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి బీ అశోక్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న జరిగే న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీన సభకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కాలనీలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడారు. విప్లవం కోసం ప్రాణత్యాగాలకు సిద్ధపడ్డ పార్టీలు కొత్త పంథా పోటాలతో వేరు పడ్డాయని, ప్రస్తుతం ఐక్య పోరాటాలు చేయాలనే నిర్ణయం మేరకు ఏకంకానున్నట్టు తెలిపారు. ఇఫ్టూ శ్రేణులు, నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు లింగయ్య, రాజేశ్వరి, మదునమ్మ, గుడిసెల స్వామి, రాయమల్లు, కాంతయ్య, నరేష్ పాల్గొన్నారు.